క్లుప్తంగా

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత



సిలిండర్ నుంచి వచ్చే మంటలను నివారించే విధానాన్ని చూపుతున్న అగ్నిమాపక సిబ్బంది

కాకినాడ రూరల్: వేసవి తీవ్రతల నేపథ్యంలో సాలిపేట అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి కె.రమణ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించి ఆపద వేళ అప్రమత్తతపై అవగాహన కల్పించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బుధవారం అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా ఆయన అవగాహన కల్పించి అనంతరం మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు ఎక్కువగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్, సిలిండర్ల నుంచి గ్యాస్ లీకేజీ తదితర కారణాలతో జరుగుతాయని వివరించారు. వాకర్స్ జిల్లా కో ఆర్డినేటర్ అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల సమయంలో సిబ్బంది సేవలు అభినందనీయమని, ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడుతున్నారన్నారు. కార్యక్రమంలో రాఘవరావు, సత్యనారాయణ, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గురజనాపల్లిలో కరోనా పాజిటివ్

కరప: మండలం గురజనాపల్లిలో బుధవారం కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. దీంతో అప్రమత్తమైన పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది ఆ ఇంటి పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. సదరు రోగి ప్రతి వారం గుండె సంబంధ చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి వస్తోంది. ఆమెకు దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు రావడంతో కరోనా పరీక్ష చేయగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఆమెను హోమ్ ఐసోలేషన్‌లో ఉంచినట్టు డాక్టర్ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. గ్రామకార్యదర్శి ఎస్‌కే నాగేంద్ర గ్రామంలో సోడియం హైపో క్లోరైడ్ పిచికారీ చేయించారు.

నేడు వెల్ బేబీ కాంటెస్ట్

బాలాజీచెరువు: రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రోటరీ హాల్లో వెల్ బేబీ కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు సురభి శారద తెలిపారు. గ్రూప్–ఏ విభాగంలో పది నెలల వయసు నుంచి 18 నెలలు, గ్రూప్–బి విభాగంలో 18 నెలల నుంచి మూడేళ్ల వయస్సుగా విభజించి పిల్లలకు ఫొటోజెనిక్ ఫేస్, స్మైల్, ఉంగరాల జుట్టు, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని బహుమతులు అందజేస్తామన్నారు. ప్రవేశాలు అందరికీ ఉచితమని ఆసక్తి గల వారు తమ పిల్లలను తీసుకువచ్చి పాల్గొనవచ్చని సూచించారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ జాహ్నవి, ప్రముఖ పిడియాట్రిషియన్ డాక్టర్ టి.అనుపమ హాజరై బహుమతులు అందజేస్తారని తెలిపారు.

ఘనంగా అన్నారపమ్మ తీర్థం



కూరాడ గ్రామదేవత అన్నారపమ్మ

కరప: మండలం కూరాడ గ్రామదేవత అన్నారపమ్మ తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. రెండు వారాలు ముందు నుంచి అమ్మవారి గరగలకు ఊరేగించారు. మంగళవారం రాత్రి తెల్లవార్లూ గరగనృత్యాలు, గారడీ, డప్పువాయిద్యాలతో జాతర నిర్వహించారు. కూరాడ గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయకమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన కిరణ్

కరప: రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు గాయపడి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పిఠాపురం మండలం చిత్రాడ నుంచి బుధవారం రామచంద్రపురం వైపు వెళ్తున్న కారు కరప సమీపంలోకి వచ్చేసరికి మోటార్ సైకిలిస్టును ఢీకొట్టింది. బైక్‌పై వెళుతున్న కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామానికి చెందిన యువకుడు అమ్మకంటి కిరణ్‌కు కుడికాలు పైన, ఇతరచోట్ల గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్సకోసం 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు ముందరభాగం కుడివైపు, మోటార్‌సైకిల్ ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

స్వీయ రక్షణే మేలు..



చున్నీలను తలకు కవచంగా ధరించిన మహిళలు

- వడదెబ్బ ప్రాణాంతకం
- రోజూ 15 గ్లాసుల నీళ్లు తాగాలి

కాకినా సిటీ: ఎండలు ముదిరిపోతున్నాయి. చిన్నారులు, వృద్ధులు, మహిళలు, నిత్యం బయట తిరగాల్సినవారు చాలా అప్రమత్తంగా ఉండాలి. ఎంతో అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని వైద్యులు సూచిస్తున్నారు. రానున్న రెండు నెలలు ఎండలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరికలు చెప్తున్నాయి.

సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే వడదెబ్బ ప్రాణాంతకమవుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. వేసవిలో 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వడగాడ్పులు వీస్తున్నాయి. దీంతో వడదెబ్బ తగిలే సూచనలున్నాయి. అత్యవసరమై బయటకు వెళ్లాల్సిన వారు రక్షణగా గొడుగు, టోపీ వంటివి తీసుకెళ్లాలని సూచిస్తున్నారు.

చేయకూడని పనులు

- తీవ్ర ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే బయట తిరగవద్దు.
- సూర్యకిరణాలు, వేడి గాలికి గురికాకూడదు.
- చల్లని రంగు పానీయాలు తాగకూడదు.
- మద్య, మాంసాహారలు తగ్గించాలి.
- ఎండ వేళల్లో శరీరంపై అలిసే పనులు చేయరాదు.
- నలుపు, మందంగా ఉన్న దుస్తులు ధరించరాదు.

ప్రథమ చికిత్స

- వడదెబ్బ సోకిన వ్యక్తిని త్వరగా నీడకు చేర్చాలి.
- చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలి.
- శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే దాకా తడిగుడ్డతో తుడుస్తూ ఉండాలి.
- చల్లని గాలి తగలేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ/చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్/ఓరల్ డీ హైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించవచ్చు.

రక్షణ పొందండి ఇలా..

- నీళ్లు, మజ్జిగ, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, ఇతర ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి.
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులనే ధరించాలి.
- రోజు 15 గ్లాసుల నీళ్లు తాగాలి.
- పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలి. రెండు పూటలా స్నానమాచరించాలి.
- భోజనం మితంగా తిని, నీళ్లు అధికంగా తాగాలి.
- ఎండ అధికంగా ఉన్న సమయంలో ఇంటి పట్టునే ఉండాలి.
- ఇంట్లో ఉన్న సమయంలో కిటికీలు తెరిచి ఉంచాలి.

జాగ్రత్త పడాలి



వడదెబ్బ ప్రాణాంతకం. ఇది సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉపాధి పనులు చేసే కూలీలు సాధ్యమైనంత ఎక్కువగా మంచినీళ్లు తాగాలి. ఉదయం 11 గంటల లోపు పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవడం ఉత్తమం. గర్భిణులు బయటకు వెళ్లరాదు. చల్లని వేళల్లోనే బయట పనులు చక్కబెట్టుకోవాలి. చిన్న పిల్లలను బయటకు పంపరాదు.

– డాక్టర్ వి.ప్రశాంతి, కాకినాడ రూరల్ మండల వైద్యాధికారి, తూరంగి

ముస్లిం మహిళలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యేల సతీమణులు ద్వారంపూడి మహాలక్ష్మి, కురసాల శ్రీవిద్య తదితరులు

- పాల్గొన్న ఎంపీ గీత, సిటీ, రూరల్ ఎమ్మెల్యేల సతీమణులు

కాకినాడ: ముస్లిం మహిళల కోసం ప్రత్యేకంగా తొలిసారి బుధవారం కాకినాడ డి కన్వెన్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మున్నెన్నడూ లేని విధంగా మహిళల కోసం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీ వంగా గీత, కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేల సతీమణులు ద్వారంపూడి మహాలక్ష్మి, కురసాల శ్రీవిద్యతోపాటు పలువురు వైఎస్సార్ సీపీ మహిళా ప్రముఖులు హాజరై రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీ గీత మాట్లాడుతూ ఎమ్మెల్యే ద్వారంపూడి ఇటువంటి మంచి సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి మాట్లాడుతూ ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కురసాల సతీమణి శ్రీవిద్య మాట్లాడుతూ దాతృత్వానికి, సర్వమత సమానత్వానికి ప్రతీకగా నిలిచే రంజాన్ కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందదాయకమన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, పలువురు మహిళా నాయకులు హాజరయ్యారు.

వైఎస్సార్ సీపీలో హసీనా ఫాతిమా చేరిక



ఎమ్మెల్యే ద్వారంపూడి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఫాతిమా

స్థానిక సాంబమూర్తినగర్ ప్రాంతానికి చెందిన ముస్లిం మైనార్టీ మహిళా నాయకురాలు హసీనా ఫాతిమా బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమెను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం, ముస్లిం మైనార్టీల పక్షపాతిగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితురాలినై వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్టు ఫాతిమా చెప్పారు. ద్వారంపూడి మాట్లాడుతూ మైనార్టీల కోసం వైఎస్సార్ సీపీ చేస్తున్న కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ను మరోసారి గెలిపించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మైనార్టీ సెల్ ప్రాంతీయ సమన్వయకర్త అబ్దుల్ బషీరుద్దీన్, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహమాన్‌ఖాన్, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖలీద్‌విన్ వలీ, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ, పార్టీ నాయకులు అజ్జు తదితరులు పాల్గొన్నారు.

రిబేటును సద్వినియోగం చేసుకోండి

- పన్ను చెల్లింపుదారులకు కమిషనర్ మహేష్‌కుమార్ పిలుపు
- రూ.20 కోట్ల లక్ష్యం సాధనకు ప్రత్యేక బృందాలు
- అధికారులతో సమీక్ష..
- వసూళ్లు వేగవంతం చేయాలని ఆదేశం



సచివాలయ ఉద్యోగులు, అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్ మహేష్ కుమార్



సమీక్షా సమావేశానికి హాజరైన సచివాలయ కార్యదర్శులు

కాకినాడ: ఈ నెల 30వ తేదీ లోపు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను ఏకమొత్తంగా చెల్లించే వారికి ఐదు శాతం రిబేట్ కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ఆదేశించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో బుధవారం అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్‌తో కలిసి పన్ను వసూళ్లు, రిబేటు, నీటి పన్నులపై వాటర్ వర్క్స్ అధికారులు, ఆర్వోలు, ఆర్ఐలు, సచివాలయ కార్యదర్శులతో సమీక్షించారు. రిబేటు అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. సంబంధిత ఉద్యోగులంతా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇప్పటికి సుమారు రూ.15 కోట్లు వసూలైందని, ఈ ఏడాది రూ 20 కోట్ల వసూళ్లు లక్ష్యంగా పని చేయాలన్నారు. నీటి పన్నుకు సంబంధించి ప్రస్తుత పాత, బకాయిలు వసూలు చేసేందుకు సచివాలయాల స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా సచివాలయాల అడ్మిన్లు, ఎమినిటీ కార్యదర్శులు, ఏఈలు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లతో ఏర్పాటయ్యే బృందాలు నీటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఏడీసీ నాగ నరసింహారావు మాట్లాడుతూ నగరాభివృద్ధికి పన్ను వసూళ్లే కీలకమని, గత ఏడాది రిబేట్ ద్వారా, ఆర్థిక సంవత్సరం మొత్తం మీద పన్ను వసూళ్లలో నగరపాలక సంస్థ మెరుగైన ఫలితాలు సాధించిందన్నారు. ఈ ఏడాది కూడా అదే ప్రగతి సాధించాలన్నారు. సమావేశంలో వాటర్ వర్క్స్ డీఈ ప్రభాకర్, ఆర్ఐలు చెక్కా రమణ, నిర్మలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను చెత్తమయం చేయొద్దు : ఏడీసీ

స్థానిక 38, 41 డివిజన్ల పరిధిలోని కమలాదేవి వీధి, బ్రహ్మంగారి గుడి వీధి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు తనిఖీ చేశారు. కొన్ని అపార్ట్‌మెంట్ల వద్ద రోడ్ల పక్కన చెత్త ఉండడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య సిబ్బందిని పిలిచి చెత్తను తొలగించాలని ఆదేశించారు. ఇదే పునరావృతమైతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణకు నగరపాలక సంస్థ ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సిబ్బంది కూడా ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వర్మ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కార్పొరేషన్ భవన నిర్మాణ పనుల పరిశీలన

అధునాతన వసతులతో విశాల ప్రాంగణంలో చేపట్టిన నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణ పనులను కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.38 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నాలుగు అంతస్తుల్లో భవనాన్ని నిర్మిస్తున్నట్లు స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు కమిషనర్‌కు వివరించారు. నూతన భవనానికి సంబంధించిన బిల్డింగ్ ప్లాన్ నమూనాను కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకట్రావు, కాంట్రాక్టర్, సుధాకర ఇన్‌ఫ్రా సంస్థ ప్రతినిధి వంగ పుల్లారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

స్పందన ప్రగతిపై ‘జగనన్నకు చెబుదాం’



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య బుధవారం సాయంత్రం అమరావతి నుంచి ‘జగనన్నకు చెబుదాం’పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఎస్.ఇలక్కియ, ఇతర జిల్లా స్థాయి అధికారులతో కలసి పాల్గొన్నారు. ప్రస్తుతం ప్రతి సోమవారం జిల్లాలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి శాఖల వారీగా వస్తున్న అర్జీల వివరాలు, వాటి పరిష్కారానికి అనుసరిస్తున్న విధానం, ప్రజల సంతృప్తి స్థాయి, జిల్లా స్థాయి అధికారులు తీసుకోవల్సిన చర్యలపై పూనం మాలకొండయ్య దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, సీపీవో పి.త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్, డీపీవో ఆర్.విక్టర్, హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్, సివిల్ సప్లయిస్ డీఎం డి.పుష్పమణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిని నిర్వీర్యం చేయడం తగదు



కరపలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకురాలు రమణి

కరప: ఉపాధి పథకాన్ని కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీపీఎం జిల్లా నాయకురాలు ఎం.రమణి అన్నారు. వామపక్షాల ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా బుధవారం కరపలో ఉపాధి కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ పాలనలో ఉపాధి పథకం ద్వారా రాష్ట్రానికి ఇచ్చే ఉపాధి నిధులు ఏటా తగ్గిస్తూ వస్తోందన్నారు. గతేడాది బడ్జెట్‌లో రూ.90 వేల కోట్లు ఇస్తే, ఈ ఏడాది రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ఉపాధి కూలీల సౌకర్యాలు కూడా తగ్గిస్తోందన్నారు. ఈ విధానాలను అందరూ కలసి కట్టుగా వ్యతిరేకించాలని రమణి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదాలతో ముద్రించిన కరపత్రాలను కూలీలకు పంచారు. మండల నాయకులు పాల్గొన్నారు.

గ్రేడ్‌-2 వీఆర్వోలకు ప్రొబేషన్ ప్రకటించాలి

కాకినాడ సిటీ: జిల్లాలో సీపీటీ, సర్వే పరీక్ష ఫెయిల్ అయిన గ్రామ రెవెన్యూ అధికారులకు (గ్రేడ్–2 వీఆర్వోలు) ప్రొబేషన్ ప్రకటించాలని వీఆర్వోల సంఘం నాయకులు డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డిని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.చిన్నారావు, దార్ల కామేశ్వరరావు, సుహాసిని, తాతారావు విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు, కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో గ్రేడ్–2 వీఆర్వోలకు సీపీటీ సర్వే పరీక్షలు ఒక సంవత్సరం సడలించి ముందుగా 1500 మందికి ప్రొబేషన్ ప్రకటించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 3795 మంది వీఆర్ఏల నుంచి వీఆర్వోలుగా పదోన్నతిపై గ్రేడ్–2 వీఆర్వోలుగా వచ్చారన్నారు. జీవో 13 ప్రకారం ఏడాది కాలంలో సీపీటీ, 15 రోజుల సర్వే ట్రైనింగ్ ఇచ్చి సర్వే పరీక్షలో పాస్ అవ్వాలని, ఉత్తీర్ణులైన వారికి రెండేళ్ల సర్వీస్ పూర్తి అయిన తర్వాత ప్రొబేషన్ డిక్లేర్ చేయాల్సి ఉందన్నారు. సర్వే పరీక్ష ఒక సంవత్సరం పెట్టలేదని, రెండేళ్ల మూడు నెలలకు హడావిడిగా సర్వే ట్రైనింగ్ ఇచ్చి పరీక్ష రాసేందుకు ఒక అవకాశం మాత్రమే ఇవ్వడం వల్ల 2200 మంది మాత్రమే పరీక్ష ఉత్తీర్ణులైనట్టు వీఆర్వో సంఘ నాయకులు తెలిపారు. మిగిలిన 1500 మంది ఫెయిల్ అయ్యారన్నారు. ఫెయిల్ అయిన వారిలో 45 ఏళ్లు పైబడిన మహిళలు అధికంగా ఉన్నారన్నారు. వీరికి సీపీటీ, సర్వే పరీక్ష నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని కోరారు. వీరందరికీ ప్రొబేషన్ డిక్లేర్ చేసి ఏడాదిలో రెండు, మూడు సార్లు పరీక్ష పెట్టి పాస్ అవ్వడానికి సడలింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రేడ్–2 వీఆర్వోలు పాల్గొన్నారు.

అభిమానులతో అఖిల్ ఫొటోలు



అభిమానులతో ఫొటోలు దిగుతున్న హీరో అఖిల్

కాకినాడ కల్చరల్: ఏజెంట్ సినిమా ప్రీ రిలీజ్‌కు వచ్చిన హీరో అక్కినేని అఖిల్ అభిమానులతో ఫొటోలు దిగి సందడి చేశారు. స్థానిక సూర్యకళా మందిర్‌లో వింటేజ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఫొటోషూట్ నిర్వహించారు. అభిమానులతో ఫొటోలు దిగి వారిని ప్రోత్సహించారు. వింటేజ్ క్రియేషన్స్ అధినేత డి.శివరామ్, మేనేజర్ కర్రి మోహన్, ప్రతినిధి బెనర్జీ, జిలాని, అభిమానులు పండు, వాసంశెట్టి శ్రీనివాస్ తదితరుల పాల్గొన్నారు.

తపాలా భవనానికి రూ.1.7 కోట్లు మంజూరు

పెద్దాపురం: పెద్దాపురంలోని తపాలా కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.7 కోట్లు మంజూరైనట్టు ఎంపీ వంగా గీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో 1956లో తపాలా భవనాన్ని నిర్మించారని, నూతన భవన నిర్మాణానికి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను నిధులు కోరామని, ఆ మేరకు ఈ కార్యాలయాన్ని మొదటి ప్రాధాన్యంగా గుర్తించి నిధులు మంజూరు చేశారన్నారు. త్వరలో ఇంజినీరింగ్ శాఖ ద్వారా టెండర్ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పోరాటయోధుడు గౌతు లచ్చన్న



సభలో మాట్లాడుతున్న బీజేపీ సిటీ నియోజకవర్గ కన్వీనర్ సత్యనారాయణ

బోట్‌క్లబ్: స్వాతంత్ర్యం కోసం ఎన్నో సార్లు జైలుకెళ్లిన పోరాటయోధుడు గౌతు లచ్చన్న అని బీజేపీ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ అన్నారు. బీజేపీ దక్షిణ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో పెద్ద మార్కెట్‌లో బుధవారం గౌతుల లచ్చన్న వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సర్దార్ బిరుదు పటేల్ తర్వాత గౌతు లచ్చన్నకే దక్కిందన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.గంగాధర్, గూడూరి పద్మ, అగ్రహారపు వేంకటేశ్వరరావు, దొడ్డి వీరేంద్ర పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న



కలెక్టర్ కృతికా శుక్లాతో రంగన్న

కాకినాడ సిటీ: జిల్లా పర్యటన నిమిత్తం కాకినాడ వచ్చిన రాష్ట్ర రజక సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుగుమంచిపల్లి రంగన్న బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, బీసీ సంక్షేమాధికారి పి.సత్యరమేష్ తదితరులు ఉన్నారు.

పక్షులకు మేత వేద్దాం వేసవి నుంచి రక్షిద్దాం



బర్డ్ ఫీడర్లు అందజేస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ

బాలాజీచెరువు: వేసవి కాలంలో పక్షులకు నీటితో పాటు ఆహారం అందించాలని లయన్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జోన్ చైర్‌పర్సన్ పద్మతులసి సమకూర్చిన బర్డ్ ఫీడర్లను (పక్షుల ఆహారపు తొట్టె) లయన్స్ క్లబ్ సభ్యులకు పంపిణీ చేసి వాటిని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. వేసవి కాలంలో వీటి ద్వారా పక్షులకు ఆహారం అందిస్తే వాటిని సంరక్షించడంలో భాగస్వామ్యం అవుతామన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు నాగలక్ష్మి, ఎంవీఎస్ కుమారి, అమ్మాజీ, కాకినాడ సఖి, స్టార్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ స్టాఫ్ నర్స్ మృతి



రమాదుర్గ (ఫైల్)

కాకినాడ క్రైం: జీజీహెచ్ స్టాఫ్ నర్సు జీజీహెచ్ లోనే ఆర్ఐసీయూ–2లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఇంద్రపాలేనికి చెందిన గుత్తుల రమాదుర్గ(32) ఆరేళ్లుగా జీజీహెచ్‌లో కాంట్రాక్టు విధానంలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నారు. ఆరు రోజుల క్రితం ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మంగళవారం తెల్లవారు జామున ఉన్నట్టుండి కళ్లు తిరిగి ఇంట్లో పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను జీజీహెచ్‌లో చేర్చారు. గైనిక్ ఐసీయూలో ఉంచి చికిత్స అందించినప్పటికీ, ఆమె పరిస్థితి దిగజారడంతో సీటీ బ్రెయిన్ స్కాన్ చేశారు. ఈ నివేదికలో తలలో పలు చోట్ల అంతర్గత రక్తస్రావం అయిందని దీనిని ఇంట్రా సెరిబ్రల్ బ్రెయిన్ హ్యామరేజ్‌గా వైద్యులు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నప్పటికీ రమాదుర్గ బుధవారం మృతి చెందింది. ఈమెకు రాఘవేంద్రతో పదేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు శ్రీ శరణ్య అనే ఏడేళ్ల బాలికతో పాటు ఆరు రోజుల ఆడ శిశువు ఉంది. ఈమె మృతిపై ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సంతాపం ప్రకటించారు.

కాలేయాన్ని కాపాడుకుందాం

కాకినాడ రూరల్/బోట్‌క్లబ్: మానవ శరీరంలో అతి పెద్ద గ్రంథి కాలేయమని ఇది చాలా ముఖ్యమైనదని కాలేయ సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టరు ఆదిత్య పేర్కొన్నారు. ప్రపంచ కాలేయ (లివర్) దినోత్సవం సందర్భంగా అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రిలో, సిటీ పరిధిలోని అహోబిల ఆస్పత్రిలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికవర్ యూనిట్ హెడ్ సిద్ధారెడ్డి అధ్యక్షతన, అహోబిల ఆస్పత్రిలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో డాక్టరు ఆదిత్య మాట్లాడుతూ కాలేయం జీవక్రియ, రోగనిరోధక శక్తి, జీర్ణక్రియ వంటి వాటికి దోహదం చేస్తుందన్నారు. అయితే కాలేయం పూర్తిగా నాశనం అయ్యే వరకు ఎలాంటి సంకేతాలను శరీరం ఇవ్వదని అందువల్ల సమస్యలు లేవని కాలేయంపై శ్రద్ధ చూపక పోతే ముప్పు తప్పదన్నారు. ఈ కార్యక్రమాల్లో అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అద్దాల సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు వెదురుపాక సతీష్, సువర్ణ, శ్రీమన్నారాయణ, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీకి మంత్రి వేణు నివాళులు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి వేణు

కాకినాడ సిటీ: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు బుధవారం కాకినాడ జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు తదితరులు పాల్గొన్నారు.